# కాలాతీత వ్యక్తులు

"మంచి నాటకం వుంది. చూస్తానంటే నీకూ టిక్కెట్టు కొంటాను" అన్నాను లక్షింపతి.

"మరి నాకు మా ఊరెళ్ళడానికి రాత్రి తొమ్మిదిన్నరకి రైలందు తుందా ?" అన్నాడు.

జవాబుగా లక్షింపతి నాకో కరపత్రం అందించాడు.

"నాటిక కదా, ఆరున్నరని వేసేరు. ఏడు గంటలకి మొదలెట్టినా ఎనిమిదికి అయిపోతుంది. వెళ్తేనే బావున్నట్టుంది" అన్నాను.

"మంచమా, కుర్చీయా ? ఏ టిక్కెట్టు కొనమంటావు నీకు ?"

"మంచ మేమిటి ?"

"మంచం ఐదు రూపాయలు, కుర్చీ రెండు, ముందు వరస మూడు."

"కుర్చీ తీసుకో, చాలు."

ఆరు గంటలకి అనుస్వార లాడ్జికి చేరాం. మూడో అంతస్తు డాబామీద ప్రోగ్రాం. షామియానాలు, రంగు దీపాలు అట్టహాసంగా వున్నాది వాతావరణం.

హాలు మధ్యన సుమారు వంద కుర్చీలు వేశున్నాయి. చుట్టూర పాతిక వరకు మంచా లున్నాయి. ఒక్కో మంచంమీద రెండేసి, తలగడాలున్నాయి. నాకు కుర్చీ చూపించి లక్షింపతి, స్టేజికి సుమారు

దగ్గిరిగా ఒక మంచంమీద సెటిలైపోయి, "నాటిక మొదలు పెట్టగానే నన్ను లేపు" అని నిద్ర కుపక్రమించాడు.

"అన్యాయం, నువ్వు నాతోబాటు కూర్చుంటావనుకున్నానే!" అన్నాను.

"సారీ బ్రదర్" అన్నాడు కళ్ళుమూస్తూ.

ఆరున్నరకి హెకాయన అనౌన్సు చేశాడు. "కార్యక్రమం ఇరవై నిమిషాల్లో మొదలవుతుం"దని.

ఏడు గంటలకి జనం రావడం పూర్తయింది. ముందు వరసలో ఒక వింగు తప్ప. మిగిలిన కుర్చీలన్నీ నిండిపోయాయి. మంచాలన్నీ ముందే నిండాయి.

ఏడుంపావుకి "ముఖ్య అతిథి ఇంటినుంచి బయల్దేరారు. సభాసదులంతా తమ తమ సీట్లలో ఆసీనులు కావాలి" అని అనౌన్సు చేశారు. ముందు వరసలో ఖాళీగావున్న వింగు నిండింది. ఆ వ్యక్తుల ఆగమన సందర్భంగా నమస్కారాలు కరస్పర్శలు చూసి వీరే నిర్వాహకులని అనుకున్నాను.

ఏడున్నరకి ముఖ్య అతిథి రాగానే ఒకాయన "స్వాగతం" పలికారు. అధ్యక్షులు, ముఖ్య అతిథి, ఇద్దరు వక్తలు" వేదిక నలంకరించారు."

"పార్థన."

ఒక కుర్రాడు స్టేజెక్కి "పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అని పాడాడు.

అందులో "ప్రార్థన" వుందా లేదా అని నేను ఆలోచించుకుంటూ వుండగానే, "అధ్యక్షులు తొలి పలుకులు" అని వినబడ్డాది. అది ప్రార్థనేనని అధ్యక్షులవారు ఎలాగో నచ్చజెప్పి, నాటి సభకు ముఖ్య

అతిథిగా, వక్తలుగా వచ్చిన వి. ఐ. పి. మరియు "కళాఖండులు" లభ్యమైనందుకు తమ ఆనందాన్నీ అదృష్టాన్నీ ఆడియన్స్‌తో పంచు కుంటున్నామని తెలవిచ్చారు.

ఆ తరవాత - ముఖ్య అతిథిని పరిచయం చెయ్యడానికి వొకరు; వక్తలిద్దర్నీ పరిచయం చేయడానికి ఇద్దరు. వందన సమర్పణ చేయ డానికి మరొకరు స్టేజి ఎక్కారు. మధ్యలో ముఖ్య అతిథి, వక్తలు తలో పదేసి నిమిషాలు; నాటక కళ ప్రాముఖ్యం- ప్రఖ్యాత నాటకా లను ఇతోధికంగా చూడవలసిన ఆవశ్యకత ఇత్యాది విషయాలను గూర్చి ఉపన్యసించారు. అధ్యక్షులు "తుది పలుకు"లలో వారు ముగ్గురూ చెప్పిన అమూల్య విషయాలను క్రోడీకరించి సమీకరించి "నాటకాలు చూడని వాళ్ళ జీవితాలు వృథా" అని సభాసదుల్ని మెడలు వంచి వొప్పించారు. ఎందుకంటే, "నాటిక చూద్దాం" అనే ఉత్కంఠా, వుబలాటం అప్పటికి అందరికి బలపడింది. ("కాలాతీత" వ్యక్తులైన నిర్వాహకులకు తప్ప.)

టైం చూశాను. ఎనిమిదీ ఇరవయ్యయిదు.

రూంకి వెళ్ళాలి. సామాను సద్దుకోవాలి. స్టేషనుకి ఆటోలో వెళితే రైలు అందవచ్చు. నాటికచూస్తే రైలుకి కాలాతీతమయిపోడం ఖాయం. గబగబా లేచి లక్షింపతి మంచం దగ్గర కెళ్ళి "లే, లే" అన్నాను.

"నాటకం మొదలైందా?" అన్నాడు కళ్ళు మూసుకునే.

"లేదు. వందన సమర్పణ చేస్తున్నారు."

"నీకు ట్రెయినుకి టైమైతో నువ్వెళిపో. ఇంకో ఇద్దరు స్టేజెక్కుతారు. అదయ్యేదాకా నేను కళ్ళు తెరవను" అన్నాడు లక్షిం పతి నిశ్చయంగా.

నేను బయటపడుతూ వుంటే నా క్లాస్మేటు సుబ్బారాయుడు కనబడి నాన్నాపి, పలకరించి.

"నాటకం చూడకుండానే వెళ్ళిపోతున్నావా?" అన్నాడు.

"ఉపన్యాసాలు లేకపోతే నాటకం చూసేవాణ్ణే" అన్నాను, ఎపాలజటిగ్గా.

"పోనీ నేను స్టేజెక్కి చెప్పే మాటలు విని వెళ్లు."

"నువ్వేమిటి మాట్లాడతావు? నువ్వూ నాటకాల ప్రాశస్త్యం గురించి చెబుతావా?" అన్నాను భయపడుతూ.

"అబ్బే, అదేం లేదు. ఒచ్చే వారం కార్యక్రమం గురించి వివరం అనౌన్సు చేయడం ఛాన్సు నాది."

"అంటే? నాటిక మొదలయ్యే లోపుగా మీ కళాసమాజం కార్యవర్గ సభ్యులు యావన్మంది కూడా ఏదో వో నెపంతో వేదిక నలంకరించి, మాట్లాడి ఫొటో తీయించుకుని దిగవలసిందేనా?" అన్నాను.

"అవును. మేం మొత్తం పదకొండు మందిమి వున్నాము. నా తరవాత నేటి నాటికలో పాల్గొనే కళాకారుల పరిచయం చేయడంకోసం భీమన్న స్టేజెక్కుతాడు. నీకు గుర్తులేదా, అతనూ మన క్లాస్‌మేటే."

"బాబోయి భీమన్న!" అనుకుంటూ చకచకా మెట్లు దిగాను. భయంతో దిగడంవల్ల కాలు బెణికింది.

అప్పుడు నాకో ఐడియా తట్టింది. నేను సినిమా తియ్యాలనుకుంటున్నాను కదా, ఒక్క కాపీనే ప్రింటు చేయిస్తాను. ఒకే వూళ్ళో ఒకే హాల్లో ఆడవచ్చు గదా. "షో" మొదలయ్యేలోగా స్టేజీ ఎక్కి సినిమా కళ లోటుపాటులు అనే విషయం మీద ముందుగా ఉపన్యసించి, అప్పుడు ప్రొజెక్టరు ఆన్ చెయ్యమంటాను. జనానికి సినిమా అంటే గౌరవం కలిగే విధానం ఇదొక్కటే అప్పుడు నేను నిజంగా "కాలాతీత వ్యక్తి" కాగలను.

(18-2-78)